
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 25 । సెప్టెంబర్ । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 22.676 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 1,545 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61 వేలు
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,495
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,660
నవర (8 గ్రాములు)	రూ.45,280

గరిష్టం/కనిష్టం
36.9 /25.4

వాతావరణం

ఆదివారం గాలిలో తేమ 51 శాతం ఉంది. సోమవారం ఉష్ణోగ్రతలు, ఎండ తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయండి



మాట్లాడుతున్న డీఆర్వో వెంకటనారాయణమ్మ

నెల్లూరు(దర్గామిట్ట): ఏపీపీఎస్సీ ద్వారా 11 కేటగిరీల పోస్టులకు సంబంధించి కంప్యూటర్ బేస్డ్ పరీక్షలు ఈ నెల 25 నుంచి వచ్చేనెల 6వ తేదీ వరకు జరుగుతాయని, పొట్టేపాళెంలో ఐఓఎన్ డిజిటల్ జోన్‌లో జరిగే ఈ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని డీఆర్వో వెంకటనారాయణమ్మ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం, మధ్యాహ్నం ఈ పరీక్షలు జరుగుతాయని, అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఉదయం 8 గంటల లోపు, మధ్యాహ్నం ఒంటిగంట లోపు వచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద చీఫ్ సూపరింటిండెంట్లు, లైజన్ ఆఫీసర్లు, పోలీసులు, మెడికల్, విద్యుత్ శాఖ అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఏమైనా అవకతవకలు జరిగితే సర్వీస్ కమిషన్ నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పరీక్ష కేంద్రానికి వెళ్లేందుకు ప్రత్యేకంగా 25 బస్సులు ఏర్పాటు చేశారని, అభ్యర్థులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని తెలిపారు.

నేటి నుంచి జిల్లా జట్ల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు జిల్లా స్కూల్ గేమ్స్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.విజయ్ ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయని తెలిపారు. తొలిరోజు ఖోఖో, బేస్‌బాల్, క్రికెట్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్, టేబుల్ టెన్నిస్ ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. 26వ తేదీ కబడ్డీ, త్రోబాల్, రగ్బీ, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, టెన్నిస్, తైక్వాండో, టెన్నికాయిట్, 27న వాలీబాల్ (అండర్-14), బాస్కెట్‌బాల్, హాకీ (అండర్-14), బాల్‌బ్యాడ్మింటన్, స్విమ్మింగ్, చెస్, జూడో, నెట్‌బాల్, ఫెన్సింగ్, 29న సాఫ్ట్‌బాల్, రోప్‌స్కిప్పింగ్, హ్యాండ్‌బాల్ (అండర్-14), ఆర్చరీ, సైక్లింగ్, యోగా, సెపక్‌తక్రా, స్కేటింగ్, రైఫిల్ షూటింగ్ ఎంపికలు జరుగుతాయని తెలిపారు.

చెస్ సాధనతో ఆలోచనల కేంద్రీకరణ

- డాక్టర్ ఉమామహేశ్వరరెడ్డి



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): చిన్నారులు, యువత ఆలోచనలను కేంద్రీకరించేందుకు చెస్ సాధన దోహదపడుతుందని ప్రముఖ వైద్యుడు ఉమామహేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం నెల్లూరులోని మైపాడు గేటు సెంటర్‌లో ఉన్న కేవీఆర్ కల్యాణ మండపంలో చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వై.సుమన్ ఆధ్వర్యంలో వై.వి.రమణారెడ్డి ద్వితీయ స్మారక ఆల్ ఇండియా ఓపెన్ చెస్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటములతో సంబంధం లేకుండా క్రీడల్లో పాల్గొనడమే క్రీడాస్ఫూర్తి అన్నారు. కలకత్తాకు చెందిన అతన్ లహరి మాట్లాడుతూ మెట్రో నగరాలకే పరిమితమైన చెస్ పోటీలకు దేశంలోని సుమారు 350 మంది అగ్రశ్రేణి క్రీడాకారులు నెల్లూరులో పాల్గొనేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. ఈ పోటీలు మొత్తం 8 రౌండ్లు జరుగుతాయని టోర్నీ డైరెక్టర్లు ఎస్.వెంకటేష్, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వై.వి.రమణారెడ్డి ట్రాన్స్‌పోర్టు అధినేత సుధాకర్‌రెడ్డి, అనూషరెడ్డి, కృష్ణా, వైఎస్సార్ జిల్లాల చెస్ అసోసియేషన్ కార్యదర్శులు దేవరం శ్రీహరి, అనీష్, ఐసీఐసీఐ బ్యాంక్ మేనేజర్ విజయ్, టోర్నీ డైరెక్టర్ వెంకటేష్, డాక్టర్ మధుసూ దన్, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభ్యాసకులకు పరీక్ష

నెల్లూరు(టౌన్): వయోజనవిద్య అక్షర చైతన్యం-2లో భాగంగా ఆదివారం అభ్యాసకులకు జిల్లా వ్యాప్తంగా పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వయోజన విద్య ఉప సంచాలకుడు మహమ్మద్ అజాద్ మాట్లాడుతూ మొత్తం 51,745 మంది అభ్యాసకులున్నట్లు తెలిపారు. 37 మండలాల్లోని 1,144 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 47,941 మంది హాజరయ్యారన్నారు. ఉదయ 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల్లోపు ఎప్పుడైనా 3 గంటలపాటు రాసే అవకాశాన్ని కల్పించామని తెలిపారు.

తీరంలో.. తనివితీరా

నేటి యాంత్రిక జీవనంలో రోజంతా ఉరుకులు పరుగులతో కాలం గడిపే ప్రతి ఒక్కరూ వారాంతాలు, సెలవు రోజుల్లో సేదతీరాలని కోరుకుంటారు. వీరిలో కొందరు సినిమాలకు సై అంటుండగా.. అధిక శాతం మంది ప్రకృతి ఒడిలో కాలం గడిపేందుకు మొగ్గు చూపుతున్నారు. దీనికి అనుగుణంగా నెల్లూరుతోపాటు సమీప జిల్లాల నుంచి ప్రజలు వచ్చి సముద్ర తీరాల్లో పిల్లాపాపలతో ఉత్సాహంగా గడుపుతున్నారు. దీంతో వీకెండ్ వచ్చిందంటే నగరానికి సమీపంలోని మైపాడు, కొత్త కోడూరు తీరాలు ప్రకృతి ప్రియులతో కళకళలాడుతున్నాయి.

- జిల్లాలోని బీచ్‌లకు పోటెత్తుతున్న పర్యాటకులు
- సెలవు రోజుల్లో కళకళ
- వసతుల కల్పనకు పర్యాటక శాఖ పెద్దపీట
- ఏటా పెరుగుతున్న రాబడి
- రూ.110 కోట్లతో రహదారి విస్తరణ

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాలు వీకెండ్ జోష్‌కు కేరాఫ్‌గా మారుతున్నాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో దాదాపు 160 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం విస్తరించి ఉంది. తుమ్మలపెంట, మైపాడు, కొత్త కోడూరు, తూపిలిపాళెం తీరాల్లో సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో ఇక్కడ సేదతీరేందుకు ప్రజలు పోటెత్తుతున్నారు. పర్యాటక శాఖ చేపడుతున్న చర్యలతో తీరానికి వచ్చే వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది.





మైపాడు బీచ్‌లో సందడి చేస్తున్న పర్యాటకులు (ఫైల్)

సౌకర్యాల కల్పనకు పెద్దపీట

- పర్యాటకులను మరింత ఆకర్షించేలా మైపాడు, తుమ్మలపెంట బీచ్‌లలో హరిత రిసార్ట్స్ పేరిట కాటేజీలను పర్యాటక శాఖ ఏర్పాటు చేసింది. ఇక్కడికి వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా రెస్టారెంట్లను సైతం నెలకొల్పారు. పర్యాటకుల అభిరుచి మేరకు అన్ని రకాల ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచుతున్నారు.
- దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు ఇక్కడి రిసార్ట్స్‌లో గదులను అద్దెకు తీసుకొని హుషారుగా గడుపుతున్నారు.
- రక్షణ చర్యలు పటిష్టంగా ఉండటంతో తీర ప్రాంతాలకు వచ్చేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు.
- మైపాడు తీరానికి సమీపంలో అద్భుత కళాసృష్టితో శివాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆలయంలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనాలను దర్శించుకునేందుకు భక్తులు భారీగా వస్తుంటారు.
- కార్తీక మాసం, శివరాత్రి సందర్భంగా సముద్ర స్నానాలను ఆచరించేందుకు భక్తులు పోటెత్తుంటారు. ఆ సమయంలో వీరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నారు.



బీచ్‌లోని రిసార్ట్స్

రహదారుల విస్తరణకు ప్రతిపాదనలు

మైపాడు తీరానికి సందర్శకుల తాకిడి పెరగడంతో ప్రతి నెలా దాదాపు రూ.పది లక్షల వరకు ఆదాయం వస్తోందని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో బీచ్‌లకు వెళ్లే ప్రధాన రహదారులను విస్తరిస్తే పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని భావించిన ప్రభుత్వం తదనుగుణంగా చర్యలు చేపట్టింది. మైపాడు బీచ్‌లోని హరిత రిసార్ట్స్ నుంచి కొత్త కోడూరు బీచ్ వరకు దాదాపు 10 కిలోమీటర్ల రహదారి విస్తరణకు ఆర్ అండ్ బీ శాఖ ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేసి ఆమోదం కోసం పంపారు. నెల్లూరు నుంచి మైపాడు వరకు నాలుగు వరుసల రహదారిని రూ.110 కోట్ల అంచనాతో విస్తరించనున్నారు. ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేసి కోర్ నెట్ ప్లాన్ ద్వారా ప్రభుత్వానికి పంపారు.

ఆహ్లాదకర వాతావరణం



సెలవు దొరికితే స్నేహితులు, బంధువులతో కలిసి మైపాడు బీచ్‌కు వెళతాం. సాగరతీరంలో ఆహ్లాదకర వాతావరణంలో సరదాగా గడుపుతాం. బీచ్‌లో రిసార్ట్స్ ఉండడంతో రాత్రులు బస చేసేందుకు సైతం అనువుగా ఉంటుంది. అలాగే తీరంలో ద్వాదశ జ్యోతిర్లింగాలయం, మల్లికార్జునస్వామి ఆలయం ఉండడంతో స్వామివార్లను దర్శించుకోవచ్చు.

– ఎం.శశికిరణ్, గూడూరు

ఆనందంగా గడపవచ్చు



నెల్లూరు నగరం నుంచి మైపాడు బీచ్ 22 కిలోమీటర్లు ఉంటుంది. బీచ్‌కు వెళ్లేందుకు రహదారి అనువుగా ఉంది. రోడ్డుకిరువైపులా పచ్చని చెట్లు, పచ్చని పొలాలతో కోనసీమను తలపిస్తోంది. బీచ్‌లో వసతులతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండడంతో ఆనందంగా గడపవచ్చు.

– కె.ప్రవీణ్, నెల్లూరు

యాభై ఏళ్ల తరువాత..



ఒకచోట కలిసిన పూర్వ విద్యార్థులు

నెల్లూరు (టౌన్): వాళ్లంతా కోట మండలం విద్యానగర్‌లో 1973-74 విద్యా సంవత్సరంలో శ్రీభీమేశ్వర సంస్కృత ప్రాచ్య కళాశాలలో విద్వాన్ చదివారు. అనంతరం ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. మళ్లీ 50 ఏళ్ల తరువాత వారందరూ ఒకచోట కలిశారు. గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఆదివారం నెల్లూరు నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆత్మీయ స్వర్ణోత్సవ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మీయంగా ఒకరిని ఒకరు పలకరించుకున్నారు. ఈ కార్యక్రమానికి రచయిత, చరిత్ర పరిశోధకులు కాళిదాసు పురుషోత్తం, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, ఆయన సతీమణి పద్మిని ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సూర్యప్రకాశరావు, సుబ్బరామయ్య, సుబ్బారెడ్డి, నరసింహులు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(టౌన్): ప్రభుత్వ గర్ల్స్ ఐటీఐలో ఖాళీగా ఉన్న రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ టెక్నీషియన్ అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ తాత్కాలిక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపల్ రజియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు ఐటీఐ రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ టెక్నీషియన్, డిప్లమో ఇన్ మెకానికల్ ఇంజినీరింగ్, బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు వచ్చే నెల 10వ తేదీలోపు స్థానిక వెంకటేశ్వరపురం, ప్రభుత్వ గర్ల్స్ ఐటీఐకు స్వయంగా లేదా పోస్టు ద్వారా దరఖాస్తులు పంపవచ్చని తెలిపారు. వివరాలకు 9491451323, 9441809057 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

దివ్యాంగులకు అండగా నిలవాలి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి



విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు పంపిణీ చేసిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తదితరులు

వెంకటాచలం: దివ్యాంగులకు సమాజం అండగా ఉంటూ వారిలో మానసిన స్థైర్యాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎర్రగుంట వద్దనున్న కాంపోజిట్ రీజనల్ సెంటర్ (సీఆర్‌సీ)లో భారతీయ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ అలింకో ఆధ్వర్యంలో 225 మంది విభిన్న ప్రతిభావంతులకు రూ.38.71 లక్షల విలువ గల 316 పరికరాలను తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలిసి మంత్రి కాకాణి ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దివ్యాంగుల్లో ధైర్యం నింపాలన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాల నిమిత్తం గ్రామాల్లో పర్యటించిన సందర్భంలో ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు తదితర ఉపకరణాలు కావాలని చాలామంది విభిన్న ప్రతిభావంతుల నుంచి విజ్ఞప్తులు వచ్చాయని తెలిపారు. వారి విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది మే నెలలో అలింకో సంస్థ సహకారంతో క్యాంపులు నిర్వహించి విభిన్న ప్రతిభావంతులకు పరీక్షలు చేయించామన్నారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి నిధుల సహకారం, అలింకో సంస్థ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 225 మందికి రూ.38.71 లక్షల విలువ గల 316 పరికరాలు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు ఒక ఎత్తు అయితే, విభిన్న ప్రతిభావంతులకు అందించే సేవల్లో ఎంతో సంతృప్తి ఉంటుందన్నారు. అవకాశం ఉన్న వ్యక్తులు, సంస్థలు విభిన్న ప్రతిభావంతులకు సహాయం చేసేందుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దివ్యాంగులకు అండగా నిలిచేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ ఈ పరికరాలు పొందిన వ్యక్తులు వాటిని జాగ్రత్తగా వినియోగించుకుని సంతోషంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్, అలింకో సంస్థ సీఈఓ రవిశంకర్, సీఆర్‌సీ డైరెక్టర్ రాజ్ మణిపాల్, జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి, దివ్యాంగులశాఖ ఏడీ అక్బర్‌అలీ, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్‌కు మహర్దశ

- ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్
- ముగిసిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీ
- విజేత ఏలూరు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విశాఖ, సత్యసాయి జిల్లాల జట్లు



విజేత జట్టుకు కప్ అందజేస్తున్న ఎంపీ శ్రీధర్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్‌కు రానున్న రోజుల్లో మహర్దశ పట్టనుందని ఏలూరు ఎంపీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్ అన్నారు. గత మూడు రోజులుగా నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ స్టేట్ సీనియర్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ ఎంతో చరిత్ర ఉన్న రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ జాతీయస్థాయిలో అత్యధిక టోర్నమెంట్‌లను నిర్వహించే దిశగా అడుగులు వేస్తోందన్నారు. అనంతపురంలో వచ్చే వారం నుంచి ఆల్ ఇండియా సబ్ జూనియర్ నేషనల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. వరుసగా మహిళ, పురుషుల రాష్ట్రస్థాయి పోటీలతోపాటు జాతీయస్థాయి పోటీల షెడ్యూల్ అనుసరించి టోర్నమెంట్‌లను నిర్వహించడంతోపాటు క్రీడాకారులను, జిల్లా అసోసియేషన్‌లను ప్రోత్సహిస్తామన్నారు. ఫుట్‌బాల్ క్రీడాకారులు తమవంతు ప్రతిభను మెరుగుపరుచుకుంటే అంతర్జాతీయస్థాయి వరకు రాష్ట్ర అసోసియేషన్ అన్నివిధాలా సహకరిస్తుందని తెలిపారు. గెలుపు ఓటములతో పనిలేకుండా టోర్నమెంట్‌లలో మెళకువలు నేర్చుకోవాలన్నారు. క్రమంతప్పని సాధన క్రీడాకారులను ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని తెలిపారు. నెల్లూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రతి జిల్లాలో టోర్నమెంట్‌ల నిర్వహణకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం తిరుపతి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.సుధాకర్, నెల్లూరు జిల్లా సీనియర్ క్రీడాకారుడు రమేష్‌బాబును ఘనంగా సన్మానించారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన క్రీడాకారుడు రాజేష్‌ను ఉత్తమ క్రీడాకారుడిగా రూ.10 వేల నగదు బహుమతి అందించి సత్కరించారు.

బహుమతి ప్రదానోత్సవం

లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరిగిన రాష్ట్రస్థాయి పురుషుల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో విజేతలుగా ఏలూరు జిల్లా, 2వ స్థానంలో విశాఖపట్టణం జిల్లా, 3వ స్థానంలో శ్రీసత్యసాయి జిల్లాలు నిలిచాయి. అతిథులు ఆయా జట్లకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి, సెట్నెల్, డీఎస్ఏ సీఈఓ నాగరాజకుమారి, డీఎస్ఏ చీఫ్ కోచ్ ఆర్కే యతిరాజ్, ఫుట్‌బాల్‌కోచ్‌లు పాండురంగారావు, సాయి, నెల్లూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి ఉమామహేశ్వరరావు, సీనియర్ క్రీడాకారులు, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు ఏపీ అధికారభాషా సంఘం అధ్యక్షుడు విజయ్‌బాబు రాక

నెల్లూరు(దర్గామిట్ట): ఏపీ అధికారభాషా సంఘం అధ్యక్షుడు పి.విజయ్‌బాబు సోమవారం నెల్లూరుకు రానున్నారు. విజయవాడ నుంచి ఉదయం 10 గంటలకు నెల్లూరు అతిథి భవనానికి చేరుకుంటారు. 12.30 గంటల వరకు సాహితీ ప్రముఖులతో చర్చ, అనంతరం మీడియా సమావేశం నిర్వహిస్తారు. 3 గంటలకు కలెక్టరేట్‌లో అధికారభాష తెలుగుపై ముఖాముఖి, సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. అలాగే స్థానికంగా జరిగే గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం విజయవాడకు తిరుగు ప్రయాణమవుతారు.

వందేభారత్‌కు ఘన స్వాగతం



నెల్లూరు రైల్వేస్టేషన్‌లో జెండా ఊపి ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తదితరులు



కావలిలో పచ్చ జెండా ఊపుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- ఉత్సాహంగా పాల్గొన్న ప్రజాప్రతినిధులు

నెల్లూరు(సెంట్రల్): రైల్వేశాఖ నూతనంగా ప్రవేశపెట్టి ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ఆదివారం ప్రారంభించిన విజయవాడ – చెన్నై సెంట్రల్ వందేభారత్ రైలు ఇనాగరల్ రన్ పూర్తయి చెన్నైకి చేరుకుంది. విజయవాడ నుంచి పలు స్టేషన్లలో ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు వందే భారత్ రైలుకు ఘన స్వాగతం పలికారు. కావలి, నెల్లూరు మీదుగా ఈ ట్రైన్ చెన్నైకి ప్రయాణించింది. కాగా ఈ రైలు నెల్లూరుకు చేరుకున్న సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ఘన స్వాగతం పలికి తిరిగి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు విజయభాస్కర్‌రెడ్డి, ఒరిస్సా శ్రీనివాసులురెడ్డి, మొయిళ్ల సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అందుబాటులో..

ఆదివారం ఇనాగరల్ రన్ పూర్తి చేసుకున్న విజయవాడ – చెన్నై సెంట్రల్ వందేభారత్ రైలు సోమవారం నుంచి ప్రతి రోజూ నెల్లూరు మీదుగా ప్రయాణించనుంది. ఈ రైలుకు నెల్లూరులో స్టాపింగ్ ఇచ్చారు. కాగా చెన్నై సెంట్రల్‌లో ఉదయం 5.30 గంటలకు బయలుదేరి నెల్లూరుకు ఉదయం 8.39 గంటలకు చేరుతుంది. ఒంగోలు, తెనాలి మీదుగా విజయవాడకు 12.10 గంటలకు చేరుకుంటుంది. అలాగే విజయవాడలో మధ్యాహ్నం 3.20 గంటలకు బయలుదేరి నెల్లూరుకు సాయంత్రం 6.19 గంటలకు చేరుకుంటుంది. గూడూరు, రేణిగుంట మీదుగా చెన్నై సెంట్రల్‌కు రాత్రి 10 గంటలకు చేరుతుంది.

కావలిలో పచ్చ జెండా ఊపిన ఎమ్మెల్యే రామిరెడ్డి

కావలి: రైల్వేశాఖ ఆదివారం ప్రారంభించిన విజయవాడ – చెన్నై వందేభారత్ రైలుకు కావలి రైల్వేస్టేషన్‌లో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. అలాగే పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. యువకులు వందేభారత్‌పై పూలు చల్లి సెల్ఫీలు తీసుకున్నారు. ఈ రైలు కావలి రైల్వేస్టేషన్‌కు చేరుకోకముందే ప్లాట్‌ఫాంపై ఏర్పాటు చేసిన సభావేదికపై ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వందేభారత్ రైలుకు కావలిలో స్టాపింగ్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చెన్ను ప్రసాద్‌రెడ్డి, డేగా రాము, ఈతముక్కల చంద్రశేఖర్‌రెడ్డి (చందు), గుర్రం వెంకటేశ్వర్లు (జీవీ), వీఎంఎస్ఆర్ మాలి, దామిశెట్టి సుధీర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంట్లో చోరీ



బీరువాలను తెరిచిన దృశ్యం

అల్లూరు: ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన అల్లూరులోని వినాయకనగర్‌లో చోటు చేసుకుంది. బాధితుల వివరాల మేరకు..వినాయకనగర్‌కు చెందిన షేక్ రఫి తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం ఉదయం బంధువుల ఊరికి వెళ్లాడు. ఆదివారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చి చూడగా తలుపు తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలు తెరిచి ఉన్నాయి. అందులోని బంగారు నల్లపూసల దండ, కమ్మలు, 100 గ్రాముల వెండి వస్తువులు, రూ.5 వేల నగదు కనిపించలేదు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వెంకటాచలం: మండలంలోని సర్వేపల్లి వద్ద ఆదివారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. వివరాలు.. ఈదగాలి గ్రామానికి చెందిన అంకయ్య మోటార్‌సైకిల్‌పై సర్వేపల్లికి వచ్చి తిరిగి వెళుతున్నాడు. తిక్కవరప్పాడు గ్రామానికి చెందిన అన్వేష్, రవి మరో మోటార్‌సైకిల్‌పై సర్వేపల్లికి వెళుతున్నారు. రెండు మోటార్‌సైకిళ్లు అంజనేయస్వామి విగ్రహం సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అన్వేష్ తీవ్రంగా గాయపడ్డాడు. రవి, అంకయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో అన్వేష్‌ను 108 వాహన సిబ్బంది నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి



గ్రామస్తులను విచారిస్తున్న ఎస్సై పుల్లారావు

కోట : మండలంలోని వంజివాకలో ఆదివారం ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెందింది.. వివరాలు.. గ్రామానికి చెందిన పోతురాజు రమేష్, హరిత(23) దంపతులు. వారికి ఇద్దరు పిల్లలు. ఏం జరిగిందో ఏమో తెలియదు హరిత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని మరణించింది. దీనిపై మృతురాలి తండ్రి ఏడుకొండలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తమ కుమార్తె మృతికి ఆమె భర్త రమేష్ కారణమని ఆరోపించాడు. ఎస్ఐ పుల్లారావు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబీకులతోపాటు గ్రామస్తులను విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కండలేరులో 12.185 టీఎంసీలు

రాపూరు:కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 12.185టీఎంసీలు ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 845 , పిన్నేరువాగుకు 10, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 10, లోలెవల్ స్లూయిస్‌కు 30 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు ఆయన వివరించారు.

భార్యను కడతేర్చిన భర్త

కలువాయి : కట్టుకున్న భార్యను భర్తే కడతేర్చిన ఘటన మండలంలోని తోపుగుంట దళితవాడలో ఆదివారం వేకువన చోటు చేసుకుంది . వివరాలు.. గ్రామానికి చెందిన వల్లం ఆదెమ్మ కుమార్తె అపర్ణకు నెల్లూరుకు చెందిన ప్రభుతో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. వినాయక చవితికి అపర్ణ తన భర్తతో కలిసి పుట్టింటికి వచ్చింది. వినాయక విగ్రహ నిమజ్జనం సందర్భంగా ప్రభుకు స్థానిక యువకుడికి స్వల్ప ఘర్షణ జరిగింది. అపర్ణ తన తల్లి సూచన మేరకు భర్తకు సర్దిచెప్పి ఇంటికి తీసుకెళ్లింది. అయితే ఇది అవమానంగా భావించిన ప్రభు దీనిపై మండిపడ్డాడు. రాత్రి ఇంట్లో అత్త, భార్యతో గొడవపడ్డాడు. రేపు గ్రామ పెద్దలతో ఈ విషయం మాట్లాడి పరిష్కరించుకుందామని అత్త ఆదెమ్మ చెప్పడంతో భార్యతో కలిసి ఇంట్లోకి వెళ్లాడు. ఆరు బయటే ఆదెమ్మ నిద్రించింది. ఉదయం ఇంట్లోకి వెళ్లి చూడగా మంచంపై రక్తపు మడుగులో కుమార్తె అపర్ణ మృతదేహం కనిపించింది. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. అల్లుడే తన కుమార్తెను రోకలిబండతో తలపై కొట్టి చంపేసి పరారయ్యాడని ఫిర్యాదు చేసింది. ఇన్‌చార్జి సీఐ రవినాయక్, ఎస్సై మహేంద్ర హుటాహుటిన గ్రామానికి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అపర్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు..

- రెండేళ్లు పూర్తి చేసుకున్న జెడ్పీ ఛైర్‌పర్సన్
- రెండేళ్లలో రూ.28 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు
- జెడ్పీ ఆదాయ వనరుల పెంపునకు చర్యలు
- పాత జెడ్పీ స్థలంలో కమర్షియల్ కాంప్లెక్స్
- నూతన జెడ్పీలో గెస్ట్‌హౌస్ నిర్మాణానికి ప్రతిపాదనలు



అభివృద్ధి పనులను మంత్రి కాకాణితో కలిసి ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ(ఫైల్)

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ పాలక వర్గం సోమవారంతో రెండేళ్లు పూర్తి చేసుకుని మూడో వసంతంలోకి అడుగుపెడుతోంది. 2021 సెప్టెంబర్ 25న జెడ్పీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆనం అరుణమ్మ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఆనం కుటుంబం నుంచి రాజకీయ ప్రవేశం చేసిన తొలి మహిళగా ఆమె జెడ్పీ పాలనలో పట్టుసాధించారు. ఉమ్మడి జిల్లాలోని 46 మండలాలకు సమానంగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. గడిచిన రెండేళ్లలో రూ.28.14 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు, బోర్లు, శ్మశానాల అభివృద్ధి, రక్షిత మంచినీటి పథకాలు, జెడ్పీ పాఠశాలల నిర్వహణ, తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 652 అభివృద్ధి పనులను చేపట్టి పూర్తి చేశారు. ఎక్కడా ఎటువంటి పొరపాట్లు జరగకుండా జెడ్పీ ఉద్యోగుల బదిలీల ప్రక్రియను నిర్వహించారు. 45 మందికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించారు. 33 మందికి ఆఫీస్ సబార్డినేట్స్‌గా , ఇద్దరికి టైపిస్టులుగా, 10 మందికి జూనియర్ సహాయకులుగా ఉద్యోగాలు కల్పించారు. 77 మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించారు. జెడ్పీ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల ఉతీర్ణత శాతాన్ని పెంచేందుకు ఏటా విజయదీపిక పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. ఈ ఏడాది నవంబర్‌లో విజయదీపిక పుస్తకాలు అందజేయనున్నారు. పాఠశాలలు, వసతిగృహాలను తరచూ తనిఖీ చేస్తూ విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో సఖ్యతగా ఉంటూ అందరి సలహాలు, సూచనలు తీసుకుంటూ జిల్లా పరిషత్ అభివృద్ధికి పాటు పడుతున్నారు.

జిల్లా పరిషత్ ఆదాయం పెంపునకు చర్యలు

జిల్లా వ్యాప్తంగా జిల్లా పరిషత్‌కు ఉన్న ఆస్తులను పరిరక్షించడంపై చైర్‌పర్సన్ ప్రత్యేక దృష్టి సారించారు. జెడ్పీ స్థలాల్లో భవన నిర్మాణాలు చేపట్టడం ద్వారా జిల్లా పరిషత్‌కు ఆదాయం సమకూర్చేందుకు ప్రణాళికలు రూపొందించారు. అందులో భాగంగా నెల్లూరులోని పాత జెడ్పీ భవనం స్థలంలో కమర్షియల్ కాంప్లెక్స్, కల్యాణ మండపం, సమావేశ మందిరం నిర్మించాలని ప్రతిపాదించి పాలకవర్గ ఆమోదాన్ని పొందారు. నగరం నడిబొడ్డున్న జెడ్పీ స్థలంలో కమర్షియల్ కాంప్లెక్స్, కల్యాణ మండపం, సమావేశ మందిరం నిర్మిస్తే క్రమం తప్పకుండా జెడ్పీకి ఆదాయం సమకూరుతుంది. ఆ దిశగా వేగవంతంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నూతన జెడ్పీ ఆవరణలో జెడ్పీటీసీలు, అధికారుల కోసం నూతన గెస్ట్ హౌస్ నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించారు.



పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ(ఫైల్)

జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా చర్యలు



జెడ్పీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తి చేసుకుని మూడో వసంతంలో అడుగుపెడుతున్నందుకు సంతోషంగా ఉంది. గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. జెడ్పీ ఆస్తులను పరిరక్షించి వాటి ద్వారా జిల్లా పరిషత్ ఆదాయాన్ని పెంపొందించే దిశగా చర్యలు తీసుకున్నాం. ఏటా జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతను పెంచేందుకు విజయదీపికి పుస్తకాలను అందజేస్తున్నాం. ఈ ప్రజాప్రతినిధులు, అధికారుల అందరి సహకారంతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

–జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

పవిత్రోత్సవాలకు కోన ముస్తాబు

- అంకురార్పణ రేపు
- 29న పూర్ణాహుతితో ముగింపు



పవిత్రోత్సవాలకు సిద్ధం చేస్తున్న హోమ గుండాలు

రాపూరు: పెనుశిల లక్ష్మీనరసింహస్వామివారి పవిత్రోత్సవాలకు పెంచలకోన క్షేత్రం ముస్తాబవుతోంది. మంగళవారం నుంచి ఆలయంలో స్వామివారి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శ్రీవారి అలంకార మండపంలో హోమాలు నిర్వహణకు హోమగుండాలు సిద్ధం చేస్తున్నారు. ఆలయాధికారులు మాట్లాడుతూ స్వామివారి దేవస్థానంలో నిత్యం జరిగే సేవల్లో తెలిసో తెలియక జరిగిన సకల దోషాల ప్రాయశ్చిత్తం కోసం పవిత్రోత్సవాలను నిర్వహిస్తారని తెలిపారు. 26వ తేదీ సాయంత్రం వేదస్వస్తి, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, అంకుర్పాణ, శ్రీవారికి స్నపన తిరుమంజనం, పవిత్రాల ప్రతిష్ఠ, ఆదివాస హోమం, ఆదివాస పవిత్ర సమర్పణ జరుగుతుందన్నారు. 27వ తేదీ సోమకుంభారాధన, అగ్నిప్రతిష్ఠ, పవిత్రాల సమర్పణ, ప్రాకారోత్సవం నిర్వహిస్తామన్నారు. 28వ తేదీ చతుస్థానార్చన, వేద, దివ్య పారాయణం, హోమం, 29వ తేదీ శేషవాహన సేవ, చతుస్థానార్చన, శాంతి హోమం, మహాకుంభప్రోక్షణ, పూర్ణాహుతి జరుగుతాయని చెప్పారు.

ఆటో బోల్తా - డ్రైవర్ మృతి

సైదాపురం : మండలంలోని మర్లపూడి గ్రామం వద్ద ఆదివారం ఆటో బోల్తా పడడంతో డ్రైవర్ మృతి చెందాడు. వివరాలు.. రాపూరు మండలం జోరేపల్లెకు చెందిన కటకం పెద్ద పెంచలయ్య (53) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం నిమ్మకాయల లోడ్ తీసుకుని గూడూరుకు వెళుతుండగా మార్గం మధ్యలో కుక్క అడ్డుగా వచ్చింది. దాన్ని తప్పించే క్రమంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన పెంచలయ్యను స్థానికులు గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదరిక నిర్మూలనకు జగనన్న యజ్ఞం

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



నాయకుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కఠోరమైన యజ్ఞం చేస్తున్నారని, అందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సహకారం అందించాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కోరారు. దగదర్తిలో ఆదివారం నిర్వహించిన మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావిస్తూ ఇచ్చిన ప్రతి హామీను జగనన్న నెరవేరస్తున్నారని తెలిపారు. జగనన్న పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతోందన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా అవినీతి రహిత పాలనను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న అని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రజల్లో ఆదరణ రోజురోజుకు పెరుగుతోందన్నారు. ప్రజాదరణ కోల్పోయిన టీడీపీ వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా పోటీకి దిగలేక జనసేనపై ఆధారపడుతోందని విమర్శించారు. ఎంత మంది కలిసి వచ్చినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేరన్నారు. రాష్ట్ర ప్రజలకు భవిష్యత్‌పై నమ్మకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాత్రమే అందించగలదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని దోచుకున్న చంద్రబాబు నాయుడును రక్షించుకునేందుకు పలుకుబడి కలిగిన తన దొంగల ముఠా సభ్యులు ఉన్నారని విమర్శించారు. ఇంతకాలం చట్టం ఎవరికైనా ఒక్కటే అని చెప్పేవారు లేరని, ఇప్పుడు చట్టం ఎవరికైనా ఒక్కటే అని చెప్పేవారు బయటకొస్తుండడంతో దొంగల ముఠా సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. పేదల గుండె చప్పుడుగా, సామాజిక న్యాయానికి చిరునామాగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందని, రాబోయే రోజుల్లో ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు ప్రజల ఆశీస్సులు జగనన్నకు ఉండేలా వారి సంక్షేమం కోసం నాయకులు పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం సస్పెన్షన్

చేజర్ల: మండలంలోని ఓబులాయపల్లి ఎస్సీ కాలనీ ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోపుగుంట మోహన్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేశారని ఎంఈఓ కళాధర్ ఆదివారం తెలిపారు. తిరుపతిలోని సైనిక పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయ శిక్షణా తరగతుల్లో ఓ మహిళపై హెచ్‌ఎం అసభ్యకరంగా ప్రవర్తించడంతో అక్కడి సిబ్బంది డీఈఓకు ఫిర్యాదు చేశారని చెప్పారు. ఈ మేరకు హెచ్‌ఎంపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపిన డీఈఓ సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారని ఎంఈఓ తెలిపారు.

వైభవంగా చిన్న గంధ మహోత్సవం



సమాధులకు గంధాన్ని లేపనం చేస్తున్న ముతవల్లీ హాఫీజ్‌పాషా



గంధ మహోత్సవానికి హాజరైన భక్తులు

అనుమసముద్రంపేట: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాలో హబీబ్ ఖాతున్నీసా(దొరసానమ్మ) వారి చిన్న గంధ మహోత్సవాన్ని శనివారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. తొలుత సంప్రదాయబద్ధంగా ముతవల్లీ సజ్జదా హఫీజ్‌పాషా గంధ కలశాన్ని తలపై పెట్టుకుని మహల్ నుంచి ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు. అనంతరం దొరసానమ్మ, హజరత్ ఖాజానాయబ్ రసూల్ వార్ల సమాధులకు గంధాన్ని లేపనం చేసి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. దొరసానమ్మ గంధ మహోత్సవానికి మహిళా భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో దర్గా ఆవరణం కిక్కిరిసిపోయింది. సంగం సీఐ రవినాయక్ ఆధ్వర్యంలో ఎస్సై నరేష్ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి ప్రతిఒక్కరికీ గంధం అందేలా చర్యలు తీసుకున్నారు. ప్రశాంతంగా గంధ మహోత్సవం ముగియడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

గణేశ్ నిమజ్జనంలో అపశ్రుతి

- విద్యుదాఘాతంతో బీటెక్ విద్యార్థి మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు




మనోజ్‌కుమార్(ఫైల్)

కోవూరు: మండలంలోని గంగవరంలో ఆదివారం గణేశ్ నిమజ్జనంలో అపశ్రుతి చోటు చేసుకుంది. వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై బీటెక్ విద్యార్థి మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. గంగవరంలో వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుడి బొమ్మను పెన్నా నదిలో నిమజ్జనం చేసేందుకు ఆదివారం ట్రాక్టర్‌పై తీసుకెళ్తున్నారు. గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని 132 కేవీ హైటెన్షన్ విద్యుత్ వైర్ల కిందకు ట్రాక్టర్ రాగానే ఒక్కసారిగా విద్యుత్ ప్రసరించింది. దీంతో 15 మంది విద్యుత్ షాక్‌కు గురయ్యారు. ఈ ఘటనలో తీవ్రంగా షాక్‌కు గురైన బీటెక్ విద్యార్థి మనోజ్‌కుమార్(22)ను స్థానికులు నెల్లూరు లోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరు అపోలో ఆస్పత్రి, మరొకరు జయభారతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మిగిలిన వారు ఇళ్లకు వెళ్లిపోయారు. ప్రమాద విషయం తెలుసుకున్న కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా మనోజ్ కుమార్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మనోజ్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.70
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.10



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 128
లేయర్ (లైవ్)	: 115
బ్రాయిలర్ చికెన్	: 222
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 248
లేయర్ చికెన్	: 195

